ఘాత*

శ్రీ ముద్దా విశ్వనాథం

[శంకరం - కొండప్ప వీథిలో]

శంకరం — ఓరే కొండిగా! అదంతా ఫస్టు రంగూన్ కలప. ఒకొక్క దూలమే చేస్తుంది యాభయ్యేసి రూపాయిలు. దానిముందు ఉక్కెంధుకూ పనికిరాదంటే నమ్ము. ఒక్క ద్వారానికైనా ఇనపమేకు లేదుకద. భవనం రావత్తూ సిమెంటు చపటాలేకాని, మచ్చుకయినా ఒక్క పెంకుముక్క అవుపడదు. అంతా మెడ్రాస్ ఫేషను. అంతా కోటకి మించిన ఫకడ్బందీ. ఆ పంఖిణీయే వేరురా. నిజంగా ఆ హవేలీ చూడని నేత్రాలు నేత్రాలే కావంటాను.

కొండప్ప — ఓరి బ్రభాజమానంవా! నీ కొచ్చాలన్నీ మనదగ్గిరకొయ్యాకు. చేతులో పిక్క ఆడుతూవుంటే- మెడ్రాస్ ఫేషన్లే కాదు, లండన్ ఫేషన్లూ ప్యారిస్ ఫేషన్లూ కూడా నేను తెచ్చిపెడతా.

శంకరం — రేడిశావులే. డబ్బుండంగానే సరా, దేము డిచ్చినందుకు సార్థకంగా తనింత తిని, ఒకళ్ల కింత పెట్టడం మన గోపాలంగారొక్కడికే చెల్లింది. ఆ మారాజు మూడంతస్థుల మేడ కట్టాడూ అంటే - తస్సాదియ్యా, "దేవీభవనం" రాజధానంతటికీ పేరెల్లిపోయింది గదుట్రా!—

కొండప్ప —ఆ!- అయిందిలే బోగం — గోపాలం గారూ, నేపాళంగారున్న! పాతికేళ్ల నాడు పోటీ గీటీ లేదుకాబట్టి, రైసుమిల్లు పెట్టి ఇష్టమొచ్చినట్టుగా దోచుకున్నాడు. ఇంకిప్పుడా పప్పు లేం ఉడకవ్. నీరూ నిప్పూ పుట్టని కుగ్రామమైనాసరే, బియ్యం మరవుండితీరాలి. ఎక్కడ్లో మాటెందుకు?- మన వెంకటాపరంలోనే పక్కలో బల్లెం లాగ కోటయ్యగాడు మరోమిల్లు లేవదీశాడా? వాడూ గోపాలమూ-ఒకళ్లని కాదని ఒకళ్లు రేట్లు కోసుకున్నారా? ఆఖరి కది వాళ్లకి గొంతుకోతగా పరిణమించిందా?

శంకరం — హాఁ!- కొండతో గొర్రె ఢీకొట్టవటమా? అందుకనే కోటయ్యకి శుభ్భరంగా తిరుక్షవరమై, దివాలా తీసి, మాసిపోయి మట్టమయ్యాడు. పురాతనంగా పాతుకుపోయిన గోపాలంగారితో ఈ దౌర్భాగ్యశిరోమణికి పోటాపోటీలా? ఒక్కనాడు ఆయన ఎడంచేత్తో దానంచేసినపాటి లేదు, వీడి ఆస్తంతా పోగు జేస్తే...

కొండప్ప — గోపాలమే కాని, మరెవ్వరూ బతకూడదా యేమిట్రా, ఆయనేం, వూరికి పుస్తె కట్టాడా?

శంకరం — నువ్వేమనూ. ఇవన్నీ బతకదలిచి చేసే పన్లు గావు. అయినా, అదేమిటో గాని, మాయలోకం—నాలుగురాళ్లు వెనకేసుకున్నవాణ్ణి చూస్తే అలోమని యేడ్చిపోతుంది, కళ్లల్లో నిప్పులోసుకుంటుంది.

కొండప్ప — ఓరే శంకరే!- మొత్తానికి గోపాలం బంగారు పిచ్చిక. పెట్టి పుట్టాడు, కలిసొచ్చింది. దైవం తిన్న జూశాడు, బావుటా యెగిరింది. అంతవరకూ చెప్పు,

* మద్రాసులోని ఆల్ ఇండియా రేడియో కేంద్రమునుండి బ్రాడ్కాస్టు చేయబడినది.

ఒప్పుకుంటాను. ఆయనగారు మూడంతస్థుల మేడ కడితే ఎవడి కేమిటి గొప్ప!

శంకరం — ఎవడి కేమిటీ!- మన వెంకటాపరంలో ఇటువంటి ధర్మదాత ఉన్నాడంటే మనకే గొప్ప...

కొండప్ప — మహా దొడ్డదాత దొరికాడెలాగయితేనేం. సంతోషించాం; చాలించు.

శంకరం —అరేయ్ కొండా! రే పొచ్చే నవరాత్రులతో కలిపి గోపాలంగారి నూతన గృహప్రవేశ మహోత్సవం. ఇదుగో గానకచ్చేరీలు జరపటానికి మైసూరునించి ఆస్థానవిద్వాంసులు దిగబోతున్నారు. తెలిసిందా? మరి - దేముడు చాలాచాలా మేలుచేస్తే, తంజావూరునించో శ్రీరంగంనించోగాని సానాయిమేళాలు, - ఇంకా, వాటి దుంపతెగా, ఏమేమిటో చిత్రాలు ట్రా...

కొండప్ప —అవున్లే. వూళ్లో పెళ్లయితే, మధ్యని కుక్కలకి అడావిడిహెచ్చుట. అలాగ్గా...

శంకరం —వోరే కొండిగా!-ఆతొమ్మిదిరోజులూ- అప్పహూ యిప్పహూ అనకుండా - చాతుర్వర్ణాలకూ, - హ. హ్హ. హ్హ! – పద్ధెనిమిది పిండివంటలతో నిరతాన్నమహాప్రదానం... విన్నావా!—

[ప్రవేశం : పోలిగాడు]

కొండప్ప — ఏవిరోయ్, పోలిగా!-

పోలిగాడు — దణ్ణాలండి బాబయ్యా.

కొండప్ప — ఇలా రారా, గాడిధకొడకా! ఏవిటా తొందర ?—

పోలిగాడు — యీది యీదంతా - ఆ కణ్ణించి ఈకడికి పందిళ్లేసుకు రావాలండి. మరిగంటే, రాటలకోసంవని తుమ్మలబీట్లోకెళ్తొత్తానండి.

కొండప్ప — అవునుగానోరే! నిన్నో సంగతి అడగాలి. మర్మం లేకండా చెబతావా, లేదా?

పోలిగాడు — అశ్శెశ్. తెల్చునండీ, ఇయాలకు వందమం దడిగిన్రు. యేమో, నిజం బగమంతుడికే తెలాలె. మా దొరగారి బవనం మనిషిని మింగుతానంటదంట. వూళ్లో యెక్కడ సూశినా యిదే గోల!

కొండప్ప — సరేలే. నువ్వెళ్లు. పని చూసుకో,

[పోలిగాడు వెళతాడు.]

విన్నావుట్రా, శంకిరీ!- జనవాక్యం!- నాలుగురోజులు మెతుకులకోసమున్నూ, సంభావనడబ్బులకోసమున్నూ ఆశపడి, లోకం కోరు కుయ్యడానికి చూస్తావుట్రా అబ్బాయ్ ?

శంకరం — అదుగదుగో. వృద్ధజంబుకం- పఠాభితాత దిగుతున్నాడెందుకోగాని.

కొండప్ప — పఠాభితాత నిజంగా పూర్వపుణ్యాం కొద్దీ అవతరించాడనుకో, మన గ్రామంలో. ఢిల్లీ కెళ్లినా ఆయన మాటకి తిరుగు లేదు. అంత ఘరానా!—

రండి, రాండి తాతగారూ! ఇప్పుడే మీమాట నుకుంటున్నాం.

[ప్రవేశం పఠాభి.]

పఠాభి — తల నెరిసిపోయిన ముండావాణ్ణి- నామాటెవరు లక్ష్యపెడతారు నాయనా! ఏదో- ఈనాలుగురోజులూ 'రామా,కృష్ణా' అని గడిపేస్తే, కళ్లు మూశేస్తాం, వొదిలిపోతుంది.

కొండప్ప — ఇంకా నయం. మీవంటి పెద్దబ్రతులు ఉండబట్టే, కాస్తంత మనగ్రామం ఇలా అయినా వుంది.

శంకరం —నిజమే. మనవూరికి మణిపూసలాగ గోపాలంగారంటూ ఉండబట్టే ఈమాత్రం

వాసయోగ్యంగా వుంది; ఈపాటైనా సవ్యంగా వెళుతోంది కాలం.

పఠాభి — పరమ లుచ్ఛా...ఆ పాపాత్ముడి పేరు నా దగ్గ రెత్తకు. వాడినించే నిక్షేపంలాంటి వెంకటాపఠానికి పీడట్టుకుంది...

కొండప్ప — అటువంటి మనిషి ఈ జిల్లా మొత్తం మీద లే డంటాడండి మన శంకరం.

పఠాభి — వా డ్రోత్రి ఛండాలపు ముండాకొడు కంటే నమ్మ కొండయ్యా. మొన్న యెలక్షన్‌లో మన వోట్లన్నీ కూడగట్టుకుని, తన రైస్‌మిల్లుకి సరాసరి రోడ్డేయించుకున్నాడు కదా! అదలా వుండనీ. మొన్న నీమధ్య కొత్తగా రప్పించిన పెద్దమివన్లు రెండింటికీ - కన్నుమూసి తెరిచే లోపల - ఓ నాటకంపెండాలంత గోదాం కట్టించిపారేశాడు, తెలుసా?— దీనికంతకీ వాడి బాబుగారి ముల్లె ఎక్కణ్ణించి తెచ్చిపెట్టాడనుకున్నావ్? - కుర్ర వాజమ్మలకి ఈ పాలిటిక్సన్నీ ఏమి అర్థం అవుతాయి. తెల్లటి వన్నీ పాలే అనుకుంటారు!—

శంకరం — కొండా! నే నిందాకానే చెప్పాగాన ట్రా - పచ్చగా ఉన్నవాణ్ణి చూస్తే దిక్కుమాలిన లోకం కన్నుకుట్టుకుంటుంది......

పఠాభి — ఓరి కుర్ర దామోదరుడా! - నిప్పులేందీ పొగపుట్టదోయ్. నిన్నగాక మొన్న పుట్టి, నాకు ధర్మపన్నాలు చెప్పొస్తున్నావా?

కొండప్ప — వాడితోటేమిటి పోనిద్దురూ తాతా!- ఇప్పుడిస్కూలున్న బిల్డింగూ - మన గోపాలంగారు దానం చేసిందేటగా! అందుకనే అంధరూ ఆయన్ని మహానుభావు డంటారు ...అయినా, దీని ఆంతర్యం మీకు తెలియాలిగానీ......

పఠాభి — గ్రామం యావత్తునీ మంత్రించినట్టుగా ఇలానే కట్టేశాడు...వె-ధ-వ! - ఉత్త చవటలు కాకపోతే, - ఇటువంటి దివ్యసౌధం చేతులారా ఎందుకు ధారపొయ్యాల్సొచ్చిందీ అనే పాయింటు ఒఖ్ఖళ్లయినా యోచించారూ? నన్ను రెచ్చగొట్టకు కొండయ్యా, ఇవన్నీ చాలాకాలమై వొదిలేసుకున్నా.

కొండప్ప — అలా అంటేకాదు, తాతగారు. నిజంగా, మీ రొవొద్దు కాయబట్టిగాని, వెంకటాపరం అంధకారబంధురంలో పడిపోనుగదండీ!

పోనీగాని, — ఇప్పుడు కొత్తగా కట్టిన మూడంతస్థుల మేడని గురించి - ఊరూవాడా పుకార్లు మోగిపోతున్నాయి కదూ, మరి పెద్దలు మీ వుద్దేశ మేమిటీ?

పఠాభి — ఓరి అబ్బాయిలూ! మన గోపాలంగారు రైస్‌మిల్లు కట్టాడు చూడండీ. అది కట్టినప్పట్లోనే దేవత నరబలి కోరింది.

మరి వొచ్చీ, అక్కడ పనిచేసే కూలీల్లో ఒకడు అప్పటికప్పుడు అదృశ్య మయిపోయినట్టు లోకం చెప్పుకోవటం జ్ఞాపక ముందా? అయితేమటుకి చెట్టుని ఒక్క ఆకు రాలిపోయింది. ఎవడి క్కావాలి ఆసంగతి. వూరూ పేరూ లేని వెంకటప్పయ్యలకోసం ఉన్నాడా చచ్చాడా అని వెతకటానికి ఎవడి కంత పట్టింది. ఏదో ఆషామాషీ - మసిపూసి మారేడుకాయ - చేసేశారు, ఐపోయింది! - గప్ చిప్!!—

కాదుగానీ, తెలియ కడుగుతాను: ఎటువంటి ఉగ్రశాంతులూ జరపందీ మన గోపాలంబాబు ఇంతటి మొనగా డయినాడోయ్ పిచ్చిపుల్లయ్యల్లారా!— నాకింక తిక్కత్తించకండి. తీగ తీస్తే డొంకంతా కదుల్తుంది... [వెళ్లి పోబోతాడు.]

కొండప్ప — తాతగారూ! మీరు కోపగించి వెళ్లిపోతే కాదు. పిల్లలవాళ్లం. ఇంటిల్లిపాదీనీ హడిలిపోతున్నాం. మీ రేదో వొక ఉపాయం చెబితే కాని, గుండె తాళకుండా వుంది. ఊళ్లో ఒఖ్ఖళ్లూ కణం కొరకటం లేదు, కన్ను ముయ్యటం లేదు. బెంగెట్టుకు ఛస్తున్నారు...

పతాభి — మనదేవత ఊరుకున్నంతసేపేగాని, తలుచుకుందిరా అంటే కుటుంబాలు కుటుంబాలే ఎగిరిపోతాయన్నమాట. అంతటితో వూరుకోదు. గ్రామాన్నంతటినీ ఒక్కకబళంకింద వూడపారేస్తుంది. ఇహ నే నేమీ చెప్పను.

* * *

[కాళికాదేవి ఆలయం: ప్రజల కోలాహలం.]

(గంటలు మోగిస్తూ, పురోహితుడు మంత్రాలు చదువుతూవుంటాడు. జనం ఊసులాడు కుంటూవుంటారు.)

"తెల్చిగోచింది - కాళీకోచ్చవం చూస్తే మన యెంకటాపరంలోనే సూడాల. కలకత్తాలో కూడా యింత తిగ్గురం లే దంటరా!"

"ఓహోహో! ఏమి ఆ కళాసౌందర్యం! ఏమి ఆ జవహగిరి వైభవం!!"

"వరేయ్, మెళ్లో ఆ మనిషిపుర్రె సూడరా. ఊఁ - ధగధగలాడుతూ - తళుక్కుమంటూ - ఆఖడ్గం దేంతో శేశా రంటవ్?—"

"కాళీమాయీ, తల్లీ! ఆదిశక్తి!..రక్షించు, రక్షించు!- మమ్మల్ని చల్లగా చూశావంటే, వచ్చే పండక్కి మ దు మేకపోతుల్ని..."

"హ-హ-హ్హా...బాపన జల్మెత్తలేదంటయ్యా!-"

పురోహితుడు — హరహరహర-ఓం...—"

"హూం! తల్లి పవిత్రపాదాలు రక్తప్రవాహంలో మునిగి తేలాల...యెంయ్, యేంటెంయ్..."

"వోశోశ్, ఆ కోరలు సూడవోయ్. ఈరుడైనా సరే, టారెత్తి పరుగుచ్చుకోవాలన్నమాట."

[కాళీదండకం-ఇద్దరు పఠిస్తూవుంటారు.]

"శ్రీమన్ మహారేణుకాశక్తి దుర్గీ మహామ్మాయి చాముండి కౌమారి కాత్యాయనీ చిత్రరేఖావతీ దైవ చూడామణీ రాజకంఠీరవీ లావణ్యసంభూత సౌభాగ్య లక్ష్మీ దయాంభోనిధీ రాజరాజేశ్వరీ మూలమంత్రాత్మకరీ భజే సస్వరూపం నమో ఉగ్రరూపం నుతా శక్తిరూపం, శాంకరీ శాంభవీ శంకర స్వాంభవీ శృంగారధారీ ఓంకారరూపీ భవానీ భవన్మాయ తెల్పంగ నే నెంతవాడన్, నీ వాలిలోకంబులెల్లన్ సృజింపన్ కృపాదృష్టి నీక్షింప, శిక్షింప రక్షింప త్రిమూర్తి స్వరూపంబులున్ దాల్చి వర్తింతువా తల్లి బ్రహ్మాండ భూతంబు లెల్లన్ తగన్ కుక్షిలో నుంచి వీక్షింతువో తల్లి,......దైత్యాళి రక్తంబు గ్రుక్కిళ్లతో ఘుక్కటన్ గ్రుక్కటన్ గ్రోలుచున్ కుంభి కుంభంబులన్ వొక్కలై గ్రుక్కి హుంకార ఘీంకారముల్ చేయ, కుంభినిన్ వేగ లంఘించి తద్దానవానీకము ల్బట్టి, ప్రాణంబులన్ గొట్టి పాశంబులన్ జుట్టి కుంతంబులన్ జీరి, బాణంబు ఖడ్గంబుచే తుండతుండీలు ఖండించి భూత భేతాళ శాకినీ ఢాకినీ కోటులన్ తృప్తి పొందించ... కృపం జూచి రక్షించు కాళీ పరంజ్యోతి భూలోకమాతా నమస్తే నమస్తే నమస్తేన్నమః."

[మళ్లీ జనంలో ముచ్చట్లు]

"వొశేవ్, కుర్రాణ్ణి విగ్రహందగ్గిరకి తీసుకురా వొద్దంటే నీక్కాదూ? జడుసుకుంటాడు..."

"గోపాలంబాబుకి యెంత బత్తిరా దేవంటేను! అన్నీ తనే సూసుకుంటడు, తనే శేసుకుంటడు, దర్మపెబువు."

"ఆరి కమ్మోరు యిలువేలుపోశ్. అందుకనే అంతోటి తాపత్తాయం..."

"యేఁవే, వెంకమ్మా! మీ చెల్లెలికి పురుడొచ్చిందా?"

"ఇంకా లేదు పిన్నీ! మద్దినాల మా కుర్రాణ్ణి పంపుతా గానీ, జానెడు దొండతీగ ముక్క పంపిద్దూ."

"అరే, గ్లాడీ ఫూల్! ఆడవాళ్ల ను రాసుకు పోతావ్, కళ్లు నెత్తిమీది కొచ్చాయా ?"

(గంట గణగణ మోగుతుంది.)

[దేవికి హారతి ఇస్తారు.]

పురోహితుడు —

"అంగరూ రెండువరసలుగా కూచోండి, ప్రసాదా లొస్తున్నాయి."

* * *

[విరామం—౮ గంటలు వినపడతాయి.]

కామేశ్వరి — బాబోయ్, బాబోయ్! — రక్షిం చండి నాయనోయ్ - ఆలస్యం చెయ్య కండి తండ్రోయ్ — నా బాబు నాకు దక్కడు, వెళ్లండి బాబోయ్ ... ఇంత మందీ జెమాజెట్టీల్లాంటి మొగాళ్లుండి, దిక్కు మాలిన ముండని రక్షించ రేమ్రోవ్ —!

గుంపులోనించి ఒకరు —

"నీ వుసురు తగుల్తుందిలేవమ్మా గాడిదకొడు క్కు. వూరికే పోదులే..."

మరొకడు — "మాయలాడి దేముడికి ఈ దిక్కుమా లిన పక్షే కనిపించిందా!..."

ఇంకొకడు — పోపోశ్. దేము డెక్కడున్నడు ?- కలికమూర్తి నాలుగుపాదాలా కదం తొ క్కుతావుంటే—"

ఉండండి, పఠాభితాత వస్తున్నాడు. దీనికి ఆలోచన ఆయనే శెప్పాల."

[ప్రవేశం : పఠాభి]

పట్టాభి — "నేను మొన్ననే చెప్పలేదటయ్యా, ఆ మహానుభావుడు ఇదివరకే కూలివాణ్ణి బలిపేశాడనీ? ఎంతనెత్తురు పారందీ ఆమిల్లు కట్టడ మైందీ? ఇప్పుడీ మూడంతస్తుల భేతాళగృహానికి ఎన్ని రక్తపుకాలవలు ప్రవ హించాల్సివుంటుందో- బుద్ధిమంతులు మీరే ఆలోచించుకోండి, నేచెప్పట మెందుకూ."

ఒకడు : "తాతగారూ, మీ రలా తప్పుకుంటే కుదరదు, ఈ యెవ్వారం. నడుంకట్టి పని శెయ్యాలె. ఇయాళ ఆదివైంది, రేపు మన మవుతం. తలమాసినకుంద ఆలోమంటే గ్రామానికి అరిష్టంకామా ?"

మరొకడు: "ఓ రెతవమ్మా!-తాతసంగతి నీకు తెలవదు. రాస్యం కొంతా వూదెయ్యటం...వుసిచ్చి వదిలెయ్యటం...అంతే...తక్కిన పనంతా మనం జరుపుకుపోవాల..."

ఇంకొకడు — "వొరేయ్, ఇందాకా కోలాటం వేశారు పిల్లలు. ఒకేళ వాళ్లతోగాని పొ య్యొడేమో..."

వేరొకడు — అవున్రోయ్. పద, పద. కనుక్కొద్దారి.

[కోలాటం]

"దేవకీపుత్రాయ
దేవదేవోత్తమాయ
భావజా గురువరాయ
భవ్యమంగళం॥

విమలరూపాయ వివిధ
వేదాంత వేద్యాయ
సుముఖచిత్తకార్చితాయ
శుభగమంగళం ॥

రామచంద్రాయ జనక
రాజజామనోహరాయ
మామకాభీష్టదాయ
మహితమంగళం ॥...

కోటయ్య —"ఇదుగో ఇలా చూడండీ!—"

అందరూ — ఉండొరే, కోటయ్యబా శేటొ సెబు తున్నడినండోశ్...

కోటయ్య — ఇవన్నీ యెందుకొచ్చిన కబుర్లూ అంట. తెల్లారితే రేపు మన గోపాలరావు పంతులు గారి ' దేవీభవనం ' లో గృహప్రవేశం. మనం యిక్కడ వాదా లేసు కుంటూ కూర్చుంటే, కావలసిన కార్యం కాస్తా

అక్కడ చల్లగా జరిగి పూరుకుంటుంది. బలి అనేది సామాన్యంగా సుముహూర్తానికి ముందే జరిగిపోవాలి కనక, బహుశా ఈపాటికే ఐపోయుంటుందేమోనని నా అనుమానం. ఏదైనా పాపం, కుర్రకుంకడి జీవాలు పుచ్చుకోకముందే తొందరపడాలి. తీరా, తరవాత ఏమనుకున్నా సార్థకం లేదు..."

(జనం) — "అవునవును"

,, — "రైట్, పదండి!"

,, — "యెళదాం, ఇప్పుడేవాడింటికెళదాం."

,, — "తలుపులు బద్దలగొట్టి, సోదా శేదాం."

[కుక్కల మొరుగులు.]

,, — "దుర్మార్గుడికి బాగా బుద్ధి సెప్పాల"

,, — "ఓరి యెంకా! మాయింటికెల్లి, అటక మీద శాపాటి దుడ్లున్నయి, అయ్యన్నీ పట్రా...ఊ...ఇక్కడున్నట్టు రావాల"

(Clock strikes 11.)

,, — "ఈడి బతుక్కి పారావా డొకడు! కొట్టేక్ ఒక్క టెంకిజెల్ల..."

,, — "ముసిలికాలపు ముచ్చట్లురా, హ.హ. హ్హా!.."

,, — "నడుమంతరపు సిరి - యేటనుకు న్నవ్ !—హాళ్లూ పెళ్లూ మంటుంది."

[తలుపులు బద్దలగొడుతూ]

,, — "ఓరి మాయలముండా కొడకా, బలెయ్యటానికి నీ కొ పకుక్కమాలినదాని నిసుగే దొరికి నాడంట్రా?..."

,, — "అప్పుడే అంతా ఐపోయిందిగా మల్లా..."

,, — "ఇదివరకల్లా యేమిటో అనుకున్నాం గానీ, నీకిరాతప్పన్లన్నీ తెలిసొచ్చాయిలే. నిన్నూ, నీ మూడంతస్థుల మేడనీ నిమిషంలో నేలమట్టం చేశేస్తాం చూస్కో..."

కోటయ్య — మా వెంకటాపరానికి దాపరించిన ఓ బ్రహ్మరాక్షసీ! పిల్లవాణ్ని తీసుకురారా యివతలకి.

గోపాలం — పిల్లవాడెవరూ? ఎవరి పిల్లవాడండి కోటయ్యగారూ?...

(జనం) —"ఆ తియ్యటి మాటలు చూడు. మెత్తటి పులి..."

,, — "ఏమీ యెరగడు, ధర్మరాజు. ఖూనీల రాయుడు..."

,, — "నిండుకుండ తొణకదండీ!..."

కోటయ్య — "అరేయ్, భటాచోర్!— నీ దేవత నరబలి కోరటం... కామేశ్వరి కొడుకుని నువు పొంచి పట్టడం... చాలాకాలం క్రితమే కనిపెట్టాం. గ్రామం యావత్తూ ఒఖ్ఖలా కోడై కూస్తూంది. నీ పెధవ్వేషాలన్నీ లోకానికి తెలియవనుకోకు...."

గోపాలం — "అయ్యో దేముడా, పిల్లలకోసమని ఓమూల మేము తపించిపోతూ వుంటే ... నోరులేని కుర్రవాణ్ణి చంపడమా? రామ రామా!– మీరెల్లా నమ్మారు ఈ కబురు కోటయ్యగారూ? ఎంత విడ్డూరమూ కాకపోతే, యేమిటీ పుకారు! సత్యప్రమాణికంగా పెద్దలు కట్టిన ఇంటికింద వుండి చెబుతున్నాను. నే నేపాపం యెరగను..".

ఒకడు —"ఈభడవాకబుర్లన్నీ మాకొద్దు. కామేశ్వరమ్మ కొడుకుని మీ యింటిదగ్గిర చూశాం. వాడిక్కడే మాయమైపోయాడు. ఇప్పుడు సోదా చెయ్యాలె."

గోపాలం — "అలాగే చెయ్యండి బాబూ. పాపం వుంటేకద భయపడ్డానికి!"

ఒకడు — "పొడు, పొడూ!..."

గోపాలం — "...అ–మ్మ—"

(జనం) — "ఒక్క గుంకీపోటు - మచ్చు సూపిచ్చరా.."

,, — "యేడిశావ్. బ్రమయాన్న సూశి దుడ్డు తిరగెయ్యహె..."

,, — "వొద్దొద్దు...జీవం పోతే యేముంది. బుద్ధి రావాల...పూచి పుచ్చుకుని, ఇద్దిలాగ్గ వొక్క లెంపకాయ..." (ధ్వని)

[చుక్కల మెరుగులు]

,, — "చఛా. పని శేత్తే, జెన్మ జెన్మానికీ గేపక ముండాల...కుడికాలుది పనికిరాదు. ఉహు...ఎడంకాలు పైజారుతీసి, ఒకటో రకమైన...(ఫడీ, ఫడీ... ధ్వని)

,, — "కసాయివోడయినా నయమే..."

గోపాలం — కోట్యయగారూ !... మీకంత అనుమానం వుంటే నన్ను బలివెయ్యండి, కసి తీర్చుకోండి. దుర్భాషలాడకండి, బాబూ! ఎందుకింత ఆవేశం !

ఒకడు — "ఈ మెత్తటిమాటలు వినే ఇన్నాళ్లా గ్రామం కళ్లుమూసుకుంది..."

(జనం) — "అరేయ్, ఈ గుడ్డ సూశా ? — నెత్తురు మరకలు ! ఆఁ !!!—"

,, — "అయిపోనాది రోయ్, పిల్లాణ్ణి పొట్టనెట్టేసుకున్నాడు..."

కోటయ్య — "ఏమిటీ !—రక్తపుగుడ్డలా!!—

(జనం) — "దొంగనా కొడుక్కి శేతు లెలా వొచ్చినాయో ... మళ్లీ బాపన పుట్టక పుట్టాడు..."

,, — "ఏం పుట్టక పుడితే యేట్రా, నీతి లేకపోనాక..."

,, — "ఎంత ఘూత ! యెంత ఘూత !!

,, — "మండ లిరగ్గొట్టెశ్...ముందూ..."

కోటయ్య — "వద్దు. వద్దు. నోరు ఖాళీ చేసుకోవద్దు. వొంటిమీద చెయి వెయ్యొద్దు. క్రిమినల్లోకి దిగిందంటే మధ్యని మనం నేరస్థుల మవుతాం. రాజయ్యా! ఆ నెత్తురు గుడ్డ జాగ్రత్తగా పట్టుకు పద. తరువాత సంగతి నే చెప్తాను.

(జనం) — "పి-ల్లల-పులి !!! "—

[అందరూ వికటంగా నవ్వుతారు.]

,, — "కేసు బణాయించనీ. పిల్లలపులి రంగు బయటపడతది! "

* * *

[పరుగెడుతున్న చప్పుడు.]

ఒకడు — "ఏమిట్రోయ్. అలా పరుగులెడుతున్నవ్?"

మరొకడు — రామకోయిలకాడ...మున్సీబునాయుడు మీటింగంట...రా రా, సప్పని..."

* * *

మున్సీబు — సూడండి, అబ్బాయిలూ!—ఈచ్చణం నించి గోపాల్రావుని యెంకటాపరంలో యెలేత్తున్నాం. వెట్టివాళ్లు ఆపక్క తొంగి సూడకూడదు. ఒక్క పిట్టయినా అక్కడ వంగి వాలకూడదు. తెల్పిందా?—

అందరూ — యెల్లమండి బాబయ్యోరు. గిజామని చచ్చినా సరే, యెల్లమండి.

ఒకడు — ఇప్పుడా మేడయెంపుతిరిగిఅంధరూ ఛీ-థూ అని కాండ్రించి వుమ్మేతున్నరండి.

మున్సీబు — ఫస్టూ...బలేషని శేశినారు.

ఒకడు — అప్పుడే అది దెయ్యాలకొంప అని పేరడిపోయిందండీ.

మరొకడు — పడదూ?-పాపం పండితే యేమవుద్దీ?-

మున్సీబు — ఇదుగో, ఈరోజు మొదలుకుని ఆరి మిల్లుకి యెవ్వరూ దాన్యం పట్టికెళ్లకూడదు. బంద్ కరో!— అందరూ కోటయబాబు మిల్లులోనే ఆడిచ్చుకోవాల.

అందరూ — అల్లాగే.

మున్సీబు — మరి, యెవ డెల్లా సాచ్చికం శెప్పాలో...అదంతా రేపొద్దుట...కోటయ బాబు వొకీల్ దగిర్నుంచి రాంగానే కబురెడ్తాను. యెల్లండి!—

* * *

[కోర్టువద్ద జనం]

" ఇవేళ అటో ఇటో తేలిపోవాలి."

" ఇప్పుడేం? రిమాండులో ఉంచిన్నాడే తేలిపోయింది. "

" వోరే,—మనలో మనమాట — ఏమిటవుతుందంటావ్ ?"

" ఏటిరా యెర్రిమొగ(వా — న్యాయం పడితే వురిశిక్ష పడి వూరుకుంటుంది. అదృష్టం బాగుండి-అధికారిగానే కనికరించినాడంటే బొంకోలు కట్టేయ్యడం ఖాయం... నే చెప్పాను చూసుకో. ఫలానినాడు అన్నా వందుగాని..."

" అదృష్టవంతు డయితే, జామీను మీదనే వొదుల్దురు."

"యేమో ! కోటయబాబు సాచ్చీకంమీద మోపున్నదంట కే సంతానూ.;

"అవున్రోయ్. అన్నట్లు ఆఖరి సాక్ష్యం కోటయదేకాదూ. పదపద. విందాం :

[కోర్టులో]

బంట్రోతు — ఉష్- సైలెన్స్. మాటాడకండి!—

* * *

[కోర్టు వరాండాలో]

బంట్రోతు —" పిట్టల కోటయ్యగారూ !
పిట్టల కోటయ్యగారూ ! !
పిట్టల కోటయ్యగారూ !!!—"

కోర్టుగుమాస్తా —
" దేముని యెదట —
" దేముని యెదట—
" ప్రమాణంచేసి—
ప్రమాణం చేసి —
" నిజం చెబుతాను —
" నిజం చెబుతాను —
" అబద్ధం చెప్పను —
" అబద్ధం చెప్పను —"

జడ్జి — ఆఖరిసాక్ష్యం కోటయ్యగారిది. ప్రాసిక్యూషన్ తరఫు వాదన కానివ్వండి.

ప్రాసిక్యూషన్ ఇన్స్పెక్టరు —
— ఏమండి కోటయ్యగారూ ! గోపాలంగారు పిల్లవాణ్ణి చంపివేశారు కదండీ ?

కోటయ్య — చిత్తం, అవునండి.

ప్రా. ఇ — పిల్లవాణ్ణి తీసుకువెళ్తూంటే మీరు చూశారు కదండీ ?

కోటయ్య — చిత్తం, చూశానండి.

ప్రా. ఇ. కోలాటంభజనదగ్గిర మీరూ ఉన్నారు కాదూ ?

కోటయ్య — నేనూ ఉన్నానండి.

ప్రా. ఇ. గోపాలంగారు ప్రతియేడూ శక్తిపూజ చేస్తారుగదండి ?

కోటయ్య — చేస్తారండి.

ప్రా. ఇ. — గోపాలంగారు - శక్తికి నరబలి యివ్వటం మీరు ఎరుగుదురు కదూ ?

కోటయ్య — చాలాకాలంనించీ పుకార్లున్నాయండి.

ప్రా. ఇ. — అయితే, కామేశ్వరి కొడుకుని తీసుకెళ్లి, అమ్మవారికి బలివేశాడనేకదూ ?

కోటయ్య — చిత్తం. అంతేనండి, మరి. పిల్లవాడికోసం తెగవెతికామండి ఏఖిడా దొరకలేదండి.

ప్రా. ఇ. — ఇదుగో, ఈరక్తపు మరకలున్న చొక్కా ఆకుర్రాడిదే కదండీ?

కోటయ్య — అవునండి. ఇదే, ఈచొక్కే వేసుకున్నాడండి, కోలాటంలో.

ప్రా. ఇ. — గోపాలంగారిల్లు సోదా చూశినప్పుడు- మీరు పంచాయితీలో వున్నారుకాదూ ?

కోటయ్య — చిత్తమండి. నన్నూ ఒక పంచాయితీదారుగా వేసుకున్నారండి.

ప్రా. ఇ. — ఈచొక్కా, ఈకత్తీ గోపాలంగారిగదిలో - మీ యెదటనే కదండి, తవ్వితీశారూ ?

కోటయ్య — చిత్తం. అప్పుడు నే నక్కడే వున్నానండి.

* * *

జ డ్జి — ముద్దాయీతరఫు. ప్లీడరుగారు ఇంకా యేమైనా అడగాల్సివుంటే అడగవచ్చు.

ప్లీడరు — ఏమండీ కోటయ్యగారూ! గోపాలం గారికీ మీకూ ఈమధ్యని నేస్తం చెడింది కాదూ ?

కోటయ్యా — నేస్తం చెడ్డ మేవిటండీ. మేమూ ఆయనా రైస్‌మిల్లు వ్యాపారస్థుల మేనండి.

ప్లీడరు — గోపాలంగారి మిల్లువల్ల మీ మిల్లుకి నష్ట మొస్తూందికదండీ?

కోటయ్యా — అదేమన్న మాటండి! యెవళ్లదృష్టం వాళ్లది. ఆమాటకొస్తే, మామిల్లువల్ల వారికే దెబ్బండి.

ప్లీడరు — గోపాలంగారు పిల్లవాణ్ని స్వయంగా చంపుతూవుంటే మీరు చూళ్లేదుగదండి?

కోటయ్యా — అయ్యో. ఏమిటి మీ చేదస్తం. ఒకళ్లు చూస్తుండగా చంపుతాట్టండీ ?

ప్లీడరు — అదుగో ఆ మడతమాటలే వొద్దంట. నీకళ్లతో నువు చూశావా, లేదా - చెప్పవయ్యా.

కోటయ్యా — నేను చూడకపోతే యేమిటండి. భగవంతుడు లేడటండీ. బాబూ, ఇలాటి ఘోరాలు దాగవండి.

ప్లీడరు — మరయితే, చంపేశి శవాన్నేం జేశాడంటారు?

కోటయ్యా — అయ్యో బాబూ! మళ్లీ రెండోకంటివాడికి కనబణ్నిస్తాట్టండీ ? — దేవికి నైవేద్యం పెట్టి ఆరగించేశాడేమోనండి.

జ డ్జి — ఏమిటయ్యా! నరమాంసమే తిన్నాడంటున్నావ్ ? పోనీ, ఆ యెముకలన్నా దొరకొద్దూ?

కోటయ్యా — అమ్మమ్మమ్మా! - నరమాంసం అనకూడదండి. దేవి ప్రసాదమండి. యెమికలకేంటండి, యెక్కడ పారేసినా, పాయె.

ప్లీడరు — ఏమండీ కోటయ్యగారూ, కళ్లారా చూడలేదని అంటున్నారుకదా, మరీ — గోపాలంగారే చంపేశారని ఎల్లా చెప్పగలరూ?

కోటయ్యా — అదేనండి మాయ! పిల్లవాడూ, ఆయనా వారి గుమ్మంలోకి వెళ్లేదాకా చూశామండి. ఆపైనేం చూడగలమండీ ?–

ప్లీ డ రు — మరయితే,-ఆ వెంటనే మీరు జనాన్ని పోగుజేసుకెళ్లి, గోపాలంగారింటిమీద పడి ఆయన్ని చావగొట్టారుకదూ?

కోటయ్యా — అయ్యోబాబూ! అదేంటండీ. నేను కోలాటందగ్గిర నిలుచునుండగా, గ్రామస్థులి కెలా తెలిసిందోగాని – అందరూ పోగడి అల్లరి చేశారటండి.

ప్లీ డ రు — సరేకానీ –.గోపాలంగారు పిల్లాణ్ణి ఎత్తుకు పోవటానికిన్నీ, జనం వెళ్లి అల్లరి చెయ్యడానికిన్ని అట్టే వ్యవధి లేదు కాదటయ్యా ?

కోటయ్యా — లేకపోవడ మేవిటండి ? సుమారు ఒక జామయినా ఐవుంటుందండి. కామేశ్వరమ్మ గోలెత్తిన తరవాతనే కదండీ, వీళ్లంతా బయల్దేరిందీ? —

(నర్సిగాడు, కామేశ్వరికొడుకు)

నర్సిగాడు — "కోటయబాబూ! కోటయబాబూ!-"

జ డ్జి — ఎవరా పొలికేకలు! –

నర్సిగాడు — కోటయబాబూ!

కుర్రవాడు — అమ్మోయ్!- అమ్మోయ్!!-అమ్మోయ్!!!

ఒ క డు — అదేటి, కుర్రాడు ఆవిడోళ్లో దూరతాడెందుకూ!—

కామేశ్వరి — బాబోయి, నా కొడుకోయ్! బతికెళ్లా వొచ్చావురా, నా తండ్రీ!! నా బాబూ!!

నర్సిగాడు — బాబూ! కోటయబాబూ! ఇదుగో బాబూ మీ కుర్రోడు...వుండందే ఏం జేసినా? ఎల్లిన కాణ్ణుంచి వొకటే పోరు, వొకటే గోల, పెసాదం మట్టడు. సూడు

బాబూ,కంకై పోనాడు. పది వొరాలిచ్చినా సరే, నేబరించ లేను బాబో. నావొల్ల కాదు.

(జనం) — "అరెరె. కామేశ్వరి కొడుకర్రా,

,, — "కామేశ్వరి కొడుకూ..."

,, — కామేశ్వరి కొడుకూ..."

,, — "కామేశ్వరి కొడుకూ..."

,, — "అవునవునూ, కామేశ్వరి కొడుకే..."

,, — "మనకామేశ్వరి కొడుకూ-" [కోలాహలం]

బంట్రోతు — సైలెన్స్. గోలచెయకండి.

జడ్జి — ఎంతఘాత ! ఎంతఘాత !!—కాస్తంత ఆలస్య మయితే...

(జనం) — "దేముడిలాటి మారాజుని యెరక్కపోయి కారుకూతలు కూశినాం."

,, — "గోపాలంబాబు పాదాలమీద పడదాం, పదండెహె."

"ముందీ కోటయ్యగాణ్ణి కాళ్లూ శేతులూ కట్టి పడెయ్యాల రండి, రండి."

,, — " కొంపలు తీసే కొరివి!-ఈడి దుంప తెగా.."

,, — ఈనాళ్ళీ నరికి నాలుగ్గుమ్మాలా కట్టినా పాపం లేదురా.

,, — తుండితుండేలుకొట్టి కాకులికీ గెద్దలకీ యెగరెయ్యాల...

,, వీడి మొహంచూస్తే, పంచమహాపాతకాలూ చుట్టుకుంటాయి, థు!—

,, — "గోపాలబాబు సత్తెమే ఆయన్ని కాపాడింది."

,, — "దేవిని నమ్ముకున్నవాళ్ల కెప్పుడూ శెరుపు లేదురా."

,, "లేదు, యేప్పుడూ శెడుపులేదు."

[సరి.]

స హ జ సౌ ం ద ర్య ము

'కామినియా నూనె' ప్రతిరోజూ వాడుట వల్ల వేలకొలది స్త్రీలు తమ కేశసౌందర్యాన్ని పెంపొందించుకుంటున్నారు. ఆ నూనె వెంట్రుకలు బాగా పెరుగునట్లు చేసి మెదడుకు చలవ చేయును

కామినియా నూనె

(రిజిస్టర్డు)

సీసా 1-కి రూ 1/- మూడు సీసాలకు రూ 2/10- వి. పి. ఛార్జీలు వేరే. ఉచితమైన మోస్తరు సీసాకు మూడుకాన్ల బిళ్లలు పంపండి.

ఓటో దిల్ బహార్

(రిజిస్టర్డు)

ప్రాగ్దేశ విశిష్టతగల చక్కని సువాసనద్రవ్యము. చాల సమ్మోహనము ఎంతకాలమైనా వాసనపోకుండ నుండును.

¼ ఔన్సు రూ 1/4- ఒకడ్రాము అణాలు 12/- వి. పి. ఛార్జీలు వేరే.

సువాసనగల కార్డు 1 అణా. ఉచితమైన మోస్తరునకు 2 అణాల బిళ్లలు పంపండి.

సోల్ యేజెంట్లు:

ANGLO - INDIAN DRUG & CHEMICAL CO., BOMBAY. 2,